

నేడు నరసాపురం బార్ అసోసియేషన్ ఎన్నికలు

ప్రజాశక్తి - నరసాపురం

నరసాపురం బార్ అసోసియేషన్ ఎన్నికలు బుధవారం నిర్వహిస్తున్నట్లు ఎన్నికల అధికారి, సీనియర్ న్యాయవాది నల్లిమిల్లి జోసెఫ్ తెలిపారు. ఇప్పటికే 10 పదవులకు ఎన్నిక ఏకగ్రీవమైందని వెల్లడించారు. బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి స్థానానికి, మరో నాలుగు కార్యవర్గ సభ్యుల పదవులకు ఎన్నికలు నిర్వహిస్తున్నట్లు ఆయన వివరించారు. ప్రధాన కార్యదర్శి పదవికి విన్నా సూర్యప్రకాశరావు, రొక్కాల గ్లాడ్‌స్టన్ కుమార్, కార్యవర్గ సభ్యుల పదవులకు కొప్పర్తి వెంకట కృష్ణమూర్తి, పులపర్తి హర్షవర్ధన్, గోరింకల వినోద్ కుమార్, కొల్లాటి ఆదినారాయణ, కంభాల స్వర్ణ పోటీ పడుతున్నారని తెలిపారు. ఎన్నికలు ఈ నెల నరసాపురం కోర్టు ప్రాంగణంలోని లైబ్రరీ హాల్‌లో బుధవారం ఉదయం 10 గంటల నుండి సాయంత్రం 4 గంటల వరకు జరుగుతుందని, ఆ తర్వాత ఓట్లు లెక్కించి ఫలితాలు వెల్లడిస్తామని జోసెఫ్ తెలిపారు.

ఉచిత బస్సుకు రైట్.. రైట్..!

15 నుంచి స్త్రీ శక్తి పథకం అమల్లోకి
ఆర్‌టిసి బస్సుల్లో మహిళలు, బాలికలు, ట్రాన్స్‌జెండర్లకు ఉచిత ప్రయాణం
రెండు జిల్లాల్లో 77 వేల మంది మహిళలకు ప్రయోజనం
పశ్చిమలో 223, ఏలూరు జిల్లాలో 177 బస్సుల్లో ఉచిత ప్రయాణం
రెండు జిల్లాలవ్యాప్తంగా 96 రూట్లలో అవకాశం
రద్దు చేసిన రూట్లలో బస్సులను పునరుద్ధరిస్తారా?



ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

మహిళలకు ఉచిత బస్సు ప్రయాణానికి అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి. అందుకు సంబంధించిన విధివిధానాలను సైతం ప్రభుత్వం విడుదల చేసింది. ఈ నెల 15 నుంచి స్త్రీ శక్తి పథకం కింద ఆర్‌టిసిలో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం అమల్లోకి రానుంది. దీంతో ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల్లోని ప్రజారవాణా శాఖాధికారులు అందుకు తగిన ఏర్పాట్లు చేసినట్లు ఇప్పటికే ప్రకటించారు. ఉచిత బస్సు ప్రయాణంపై జనాల్లో తీవ్ర చర్చ సాగుతోంది. పథకం అమలుపై అనేక అభిప్రాయాలు వెల్లడవుతున్నాయి. జిల్లాల్లో పల్లె వెలుగు, అల్ట్రా పల్లె వెలుగు, ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో ఉచితంగా ప్రయాణించే అవకాశం ఉంది. మెట్రో ఎక్స్‌ప్రెస్, సిటీ ఆర్డనరీ బస్సులు విజయవాడ, విశాఖపట్నం వంటి నగరాల్లో మాత్రమే ఉంటాయి. ఏలూరు జిల్లాలో మూడు డిపోల పరిధిలో 309 బస్సులు ఉన్నాయి. వీటిలో 162 పల్లెవెలుగు, అల్ట్రా పల్లె వెలుగు, 15 ఎక్స్‌ప్రెస్ బస్సులు మొత్తం 177 బస్సుల్లో ఉచిత ప్రయాణానికి అవకాశం కల్పిస్తూ ఏర్పాట్లు చేశారు. మొత్తం 63 రూట్లలో ఈ బస్సులు తిరగనున్నాయి. ప్రస్తుతం సగటున రోజుకు 80 వేల మంది ప్రయాణిస్తుండగా 32 వేల మంది మహిళా ప్రయాణికులు ఉన్నట్లు ఆర్‌టిసి అధికారులు చెబుతున్నారు. ఉచిత ప్రయాణం అమల్లోకి వస్తే మహిళా ప్రయాణికుల సంఖ్య పెరగనున్నట్లు అంచనా వేస్తున్నారు. అందుకు తగిన విధంగా బస్సులను ఏర్పాటు చేసినట్లు ఆర్‌టిసి అధికారులు చెబుతున్నారు.

పశ్చిమగోదావరి జిల్లాలో నాలుగు డిపోల పరిధిలో మొత్తం 298 బస్సులు ఉండగా, 223 బస్సుల్లో ఉచిత ప్రయాణం వర్తించనుంది. జిల్లాలో 33 ప్రధాన రూట్లలో ఉచిత ప్రయాణం సాగనుంది. పశ్చిమగోదావరి జిల్లాలో రోజుకు సగటున 82 వేల మంది ప్రయాణికులు ఆర్‌టిసి బస్సుల్లో ప్రయాణం చేస్తున్నారు. మహిళా ప్రయాణికులు 45 వేల మంది వరకూ ఉన్నట్లు అధికారులు తేల్చారు. ఉచిత బస్సులో ప్రయాణంతో మహిళల సంఖ్య మరింత పెరగనుంది. ఉచిత బస్సు ప్రారంభించిన తర్వాత దాదాపు మూడు నెలలు బాగా రద్దీ ఉంటుందని అంచనా వేస్తున్నారు. బస్సులు చాలకపోతే స్కూల్ బస్సులను సైతం నడిపే ఆలోచనలో ఆర్‌టిసి యాజమాన్యం ఉంది. కండక్టర్లు, ఇతర సిబ్బందిని పూర్తిస్థాయిలో సిద్ధం చేసినట్లు అధికారులు చెబుతున్నారు.

రద్దు చేసిన రూట్లను పునరుద్ధరిస్తేనే ప్రయోజనం

ప్రయాణికులు సరిపడా లేరని, రోడ్లు సరిగా లేవనే పలు కారణాలతో రెండు జిల్లాల్లో అనేక రూట్లలో బస్సు సౌకర్యాన్ని ఆర్‌టిసి నిలిపివేసింది. ఏలూరు జిల్లాలో అటువంటి గ్రామాలు 113 వరకూ ఉండగా, పశ్చిమగోదావరి జిల్లాలో పెద్దసంఖ్యలో ఉన్నాయి. ఆయా గ్రామాలకు సంబంధించిన ప్రయాణికులంతా ఆటోలు, ఇతర వాహనాల్లో పట్టణ ప్రాంతాలకు చేరుకోవాల్సి వస్తోంది. ఉచిత బస్సు ప్రయాణం పథకం అమల్లోకి తెస్తున్న నేపథ్యంలో గతంలో రద్దు చేసిన రూట్లలో ఆర్‌టిసి బస్సులను నడపాలని జనం కోరుతున్నారు. తమకు ఉచిత బస్సు సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేస్తున్నారు. నిలిచిపోయిన రూట్లలో బస్సు సౌకర్యం కల్పించినప్పుడే పథకం పూర్తిస్థాయిలో ప్రజలు ఉపయోగించుకునే అవకాశం ఉంటుంది.

విద్యా వ్యవస్థ పటిష్టానికి ప్రణాళిక

కలెక్టర్ నాగరాణి

ప్రజాశక్తి - భీమవరం

వికసిత్ భారత్‌ను సాకారం చేసుకోవడానికి విద్యా వ్యవస్థ పటిష్టానికి అవసరమైన ప్రణాళికలను రూపొందించాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి సంబంధిత విద్యాశాఖాధికారులను ఆదేశించారు. మంగళవారం జిల్లా కలెక్టరేట్‌లో వికసిత్ భారత్ లక్ష్యంగా పాఠశాల విద్య-నిర్మాణ విభాగాలు అనే అంశంపై జిల్లాలోని విద్యాశాఖాధికారులతో నిర్వహించిన ఒక్కరోజు వర్క్‌షాప్‌లో ఆమె పాల్గొని పలు సూచనలు చేశారు. కలెక్టర్ నాగరాణి మాట్లాడుతూ వికసిత్ భారత్‌ను సాధించడానికి సమగ్రమైన విధానం అవసరమన్నారు. దీని నిర్మాణంలో అత్యంత కీలకమైనది నాణ్యమైన పాఠశాల విద్య అని తెలిపారు. జాయింట్ కలెక్టర్ టి.రాహుల్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ విద్యార్థి దశలో ఆరోగ్యంగా ఉండడం ఎంతో కీలకమన్నారు. ప్రతిఒక్క విద్యార్థీ తెలుగు, హిందీ, ఇంగ్లీష్ భాషలపై పట్టు సాధించేలా బోధించాలన్నారు. కమ్యూనికేషన్ స్కిల్స్‌పై దృష్టి సారించేలా చూడాలన్నారు. కార్యక్రమంలో డిఇఒ ఇ.నారాయణ, ఎస్ఎస్ఎ ఎపీసీ పి.శ్యాంసుందర్, డివైఇఒలు, ఎంఇఒలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ నాగరాణి

నేడు భీమవరంలో రానున్న జగన్

ప్రజాశక్తి - భీమవరం

వైసిపి అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్.జగన్ బుధవారం భీమవరం విచ్చేయనున్నారు. ఉంగుటూరు మాజీ ఎంఎల్ఎ పుప్పాల వాసుబాబు కుమార్తె వివాహ వేడుకకు హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించనున్నారు. 13న మధ్యాహ్నం 3.15 గంటలకు తాడేపల్లిలోని నివాసం వద్ద నుంచి 3.20 గంటలకు హెలీప్యాడుకు వస్తారు. 3.30 గంటలకు అక్కడి నుంచి బయలుదేరి 4.15 గంటలకు భీమవరంలోని విఎస్ఎస్ గార్డెన్స్ సమీపంలోని హెలీప్యాడ్‌కు చేరుకుంటారు. రోడ్డు మార్గం గుండా 4.35 గంటలకు వివాహ వేదిక విఎస్-ఎస్ గార్డెన్‌కు చేరుకుని నూతన వధూవరులను ఆశీర్వదిస్తారు. అనంతరం 5.10 గంటలకు హెలీప్యాడ్ నుంచి తాడేపల్లి బయలుదేరి వెళ్తారు.

కృష్ణబలిజ, పూసల సహకార కార్పొరేషన్ ఛైర్మన్‌గా త్రిమూర్తులు

ప్రజాశక్తి - భీమవరం టౌన్

ఆంధ్రప్రదేశ్ కృష్ణబలిజ, పూసల సహకార ఆర్థిక కార్పొరేషన్ లిమిటెడ్ ఛైర్మన్‌గా భీమవరానికి చెందిన గంటా త్రిమూర్తులు నియమితులైయ్యారు. త్రిమూర్తులు కృష్ణబలిజ రాష్ట్ర అధ్యక్షునిగా అనేక సేవా కార్యక్రమాలు నిర్వహించారు. టిడిపి కార్యక్రమాల్లోనూ చురుగ్గా పాల్గొంటున్నారు. తనకు ఛైర్మన్ పదవిని కేటాయించిన సిఎం చంద్రబాబుకు, మంత్రి లోకేష్‌కు, పిఎసి ఛైర్మన్ అంజిబాబు, టిడిపి నేతలు తోట సీతారామలక్ష్మి, మెంటే పార్థసారథి, కోళ్ల నాగేశ్వరరావుకు త్రిమూర్తులు కృతజ్ఞతలు తెలిపారు. తనపై పెట్టుకున్న నమ్మకాన్ని వమ్ము చేయకుండా కార్పొరేషన్ అభివృద్ధితోపాటు, పార్టీ అభివృద్ధికి శక్తి వంచన లేకుండా కషి చేస్తానని గంటా త్రిమూర్తులు తెలిపారు.



త్రిమూర్తులను అభినందిస్తున్న టిడిపి యువ నేత నారా లోకేష్

ఆఫీసర్స్ క్లబ్ కూల్చివేత

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

తాడేపల్లిగూడెం పట్టణ ప్రజలతో 64 సంవత్సరాల అనుబంధం కలిగిన ఆఫీసర్స్ క్లబ్, దానికి అనుసంధానంగా ఉన్న బివిఆర్ కళా కేంద్రం ప్రాంగణాన్ని మున్సిపల్ అధికారులు మంగళవారం కూల్చివేశారు. ఈ ప్రాంతం ప్రభుత్వ భూమిలో ఉండడంతో కోర్టు సముదాయానికి దారి కల్పించే నిమిత్తం ఆర్‌డిఒ ఆదేశాల మేరకు ఈ చర్యలు చేపట్టినట్లు మున్సిపల్ కమిషనర్ ఎం.ఏసుబాబు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ప్రాంతం గ్రామకంఠం భూమిగా మున్సిపల్ రికార్డులు నమోదై ఉందన్నారు. కోర్టు వారు రాజమార్గం ఏర్పాటు చేయాలని దరఖాస్తు చేసిన తరువాత ఆర్‌డిఒ ఆదేశాల ప్రకారం తొలగించినట్లు తెలిపారు. ఈ భూమిని ఆర్‌డిఒకు అప్పగిస్తామని తదుపరి చర్యలు ఉన్నతాధికారులు నిర్ణయిస్తారని తెలిపారు. కళాకారుల విజ్ఞప్తి మేరకు తగిన చర్యలు కూడా పరిగణలోకి తీసుకుంటామని కమిషనర్ తెలిపారు. కూల్చివేత సమయంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీస్ బలగాలను, మున్సిపల్ సిబ్బందిని మోహరించి ప్రశాంత వాతావరణంలో కూల్చివేత పనులు పూర్తి చేసినట్లు కమిషనర్ తెలిపారు. దీంతో దశాబ్దాల కాలం కలలకు, కళాకారులకు వేదిక నిలిచిన ఈ భవనాలు నేలమట్టం కావడంతో కళాకారులు ప్రజా సంఘాలు కూల్చివేతలు ఆపాలని నిరసన వ్యక్తం చేసినా అధికార యంత్రాంగం పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు.

పోడూరు తహశీల్దార్‌కు కలెక్టర్ అభినందన

ప్రజాశక్తి - భీమవరం

ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ సభ్యత్వ నమోదుకు విశేష కృషి చేసి రూ.లక్ష డ్రాఫ్టును అందించిన పోడూరు తహశీల్దార్ సయ్యద్ మౌలానా ఫాజిల్‌ను కలెక్టర్, జిల్లా రెడ్‌క్రాస్ సొసైటీ అధ్యక్షులు చదలవాడ నాగరాణి అభినందించారు. స్థానిక కలెక్టరేట్లో ఫాజిల్ కలెక్టర్‌కు రూ.లక్ష డ్రాఫ్ట్‌ను అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ నాగరాణి మాట్లాడుతూ పోడూరు మండలం నుండి సభ్యత్వ నమోదుకు కృషి చేసిన తహశీల్దార్ ఫాజిల్‌ను స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. జిల్లాలోని తహశీల్దార్లు పెద్దఎత్తున సభ్యత్వ నమోదు ద్వారా విరాళాలు సేకరించి రెడ్‌క్రాస్‌కు అందించాలన్నారు. రెడ్‌క్రాస్ ద్వారా అనేక సేవా కార్యక్రమాలు చేపట్టడం వల్ల జిల్లా గర్వించే విధంగా ఇప్పటికే గోల్డ్ మెడల్ సాధించామన్నారు. ఫాజిల్ నమోదుకు ఈ ఏడాది జనవరిలో కూడా రూ.లక్ష అందజేశారు. కార్యక్రమంలో జెసి టి.రాహుల్ కుమార్‌రెడ్డి, డిఇఒ ఇ.నారాయణ, ఎస్ఎస్ఎ ఎపీసీ పి.శ్యామ్‌సుందర్ పాల్గొన్నారు.



కలెక్టర్ నాగరాణికి చెక్కు అందజేస్తున్న తహశీల్దార్ సయ్యద్ మౌలాని ఫజిల్

ర్యాగింగ్, గృహహింస నేరాలపై ప్రత్యేక దృష్టి

శక్తి టీమ్ కార్యాలయాన్ని ప్రారంభించిన ఎస్‌పి అద్నాన్ నయీం అస్మీ

ప్రజాశక్తి - నరసాపురం

జిల్లాలో ర్యాంగింగ్ నిరోధం, గృహహింస నేరాల అదుపుపై ప్రత్యేక దృష్టి సారించినట్లు జిల్లా ఎస్‌పి అద్నాన్ నయీం అస్మీ తెలిపారు. నరసాపురం పోలీసు సబ్ డివిజన్‌లో శక్తి బృందాల కార్యకలాపాల నిర్వహణకు ఏర్పాటు చేసిన ప్రత్యేక శక్తి పోలీసు టీమ్ కార్యాలయాన్ని మంగళవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎస్‌పి మాట్లాడుతూ మహిళలు, బాలికలపై జరిగే నేరాలను నియంత్రించడం, వారికి కౌన్సెలింగ్, బాధితులకు సత్వర న్యాయం ఈ ప్రత్యేక శక్తి పోలీసు టీమ్ లక్ష్యమని వివరించారు. జిల్లావ్యాప్తంగా నాలుగు శక్తి పోలీసు టీమ్‌లను ఏర్పాటు చేశామని చెప్పారు. ర్యాగింగ్, బాలికలపై అత్యాచారాలు, గృహహింస నేరాలపై ఈ బృందాలు నిరంతరం పనిచేస్తాయని వివరించారు. విద్యాసంస్థల్లో అవగాహనా కార్యక్రమాలు నిర్వహిస్తాయని చెప్పారు.



శక్తి టీమ్ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న ఎస్‌పి

రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు

నరసాపురం రూరల్ సర్కిల్, మొగల్తూరు పోలీస్ స్టేషన్ పరిధిలోని జాతీయ రహదారి 216పై రోడ్డు ప్రమాదాలను నివారించడానికి ఒఎన్‌జిసి సహకారంతో ప్రమాదాలు ఎక్కువగా జరిగే ప్రాంతాల్లో రేడియం స్టిక్కర్లతో ప్లాస్టిక్ డ్రమ్ములను ఏర్పాటు చేయనున్నట్లు ఎస్‌పి తెలిపారు. వాహన చోదకులు ప్రతిఒక్కరూ కచ్చితంగా రహదారి భద్రతా నిబంధనలు పాటించాలని, నిర్లక్ష్యంతో చేసే చిన్న చిన్న పొరపాట్లు వల్ల ప్రాణనష్టం కలుగుతుందన్నారు. వచ్చేనెలలో జిల్లాలో పోలీసులకు కొత్త వాహనాలు వస్తున్నాయని చెప్పారు. మరమ్మతులకు గురైన వాహనాల స్థానంలో కొత్త వాహనాలను ప్రవేశ పెడతామన్నారు. సిబ్బంది నియామకాలు త్వరలో జరుగుతాయని వివరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు ఎస్‌పి వి.భీమారావు, నరసాపురం డిఎస్‌పి డాక్టర్ జి.శ్రీవేద, సిఐలు వి.పుల్లారావు, బి.యాదగిరి, జి.దుర్గాప్రసాద్, రజనీకుమార్, జి.శ్రీనివాస్, ఆర్.విజయ్‌కుమార్, ఎస్ఐలు టి.వెంకటసురేష్, సిహెచ్.జయలక్ష్మి, నాగలక్ష్మి, వాసు, గురయ్య తదితరులు పాల్గొన్నారు.

మత్తు పదార్థాలు, ర్యాగింగ్‌కు దూరంగా ఉండాలి

ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ బోయపాటి శ్రీలత

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

విద్యార్థులు మత్తు పదార్థాలకు, ర్యాగింగ్‌కు దూరంగా ఉండాలని, ర్యాగింగ్‌కు పాల్పడి జీవితాలను నాశనం చేసుకోవద్దని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ డిప్యూటీ కమిషనర్ (ఏలూరు) బోయపాటి శ్రీలత సూచించారు. ఎపి నిట్‌లో అంతర్జాతీయ యువజన దినోత్సవాన్ని పురస్కరించుకుని యాంటీ ర్యాగింగ్ డే, నశాముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమాలను మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీలత మాట్లాడుతూ విద్యార్థులు ఎవరైనా ర్యాగింగ్ కు పాల్పడితే వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మత్తు పదార్థాల వినియోగానికి దూరంగా ఉండాలని కోరారు. ఎక్సైజ్ శాఖ అసిస్టెంట్ కమిషనర్ (ఏలూరు) కెవిఎన్.ప్రభుకుమార్ మాట్లాడుతూ డ్రగ్స్‌రహిత సమాజ స్థాపనకు ప్రతిఒక్కరూ కృషి చేయాలన్నారు. విద్యార్థులు చదువుపై దృష్టి పెట్టి బంగారు భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలన్నారు. మత్తు పదార్థాల వినియోగం వల్ల తలెత్తే దుష్పరిణామాలపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. నిట్ రిజిస్ట్రార్ డాక్టర్ పి.దినేష్‌శంకర్‌రెడ్డి మాట్లాడుతూ సీనియర్ విద్యార్థులు జూనియర్ విద్యార్థులతో స్నేహభావంతో మెలగాలని సూచించారు. తాడేపల్లిగూడెం డిఎస్‌పి ధర్మవరపు విశ్వనాథ్ మాట్లాడుతూ ర్యాగింగ్ చట్టాలు చాలా కఠినంగా ఉన్నాయని హెచ్చరించారు. కార్యక్రమానికి కోఆర్డినేటర్‌గా వ్యవహరించిన నిట్ అసోసియేట్ డీన్ డాక్టర్ రాజేశ్వరరెడ్డి మాట్లాడుతూ విద్యా సంస్థలో ర్యాగింగ్, డ్రగ్స్ నివారణ కోసం ప్రత్యేకంగా యాంటీ డ్రగ్స్, యాంటీ ర్యాగింగ్ కమిటీలను ఏర్పాటు చేశామన్నారు. తాడేపల్లిగూడెం రూరల్ సిఐ రవికుమార్ మాట్లాడుతూ విద్యార్థులు ర్యాగింగ్‌కు పాల్పడితే ఎలాంటి శిక్షలు విధిస్తారో వివరించారు. ఈ కార్యక్రమంలో ఎక్సైజ్ సిఐ స్వరాజ్య లక్ష్మి, ప్రొఫెసర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బోయపాటి శ్రీలత

పెనుగొండలో సెప్టెంబర్ 17 నుంచి సిఐటియు జిల్లా మహాసభ

ప్రజాశక్తి - పెనుగొండ

సిఐటియు జిల్లా మహాసభ సెప్టెంబర్ 17, 18, 19 తేదీల్లో పెనుగొండలో నిర్వహించనున్నట్లు సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కె.రాజారామ్మోహన్‌రాయ్ తెలిపారు. స్థానిక టిటిడి కళ్యాణ మండపంలో మంగళవారం నిర్వహించిన సిఐటియు మండల మహాసభకు ఆయన ముఖ్యఅతిథిగా విచ్చేసి మాట్లాడారు. జిల్లా మహాసభకు జిల్లా నలుమూలల నుంచి కార్మిక ప్రతినిధులు విచ్చేస్తారని తెలిపారు. గత మహాసభ నుంచి ఇప్పటి వరకూ సాగించిన పోరాటాలను సమీక్షించుకుని, భవిష్యత్ పోరాటాలకు కార్యాచరణ ప్రణాళిక రూపొందిస్తారని తలెఇపారు. పాలకుల విధానాల కారణంగా నేటికీ కార్మికులకు కనీస వేతనాలు అందని ద్రాక్షగా ఉన్నాయన్నారు. మతం, కులం పేరుతో ప్రజల్లో చీలికలు తీసుకొస్తున్న శక్తుల పట్ల అప్రమత్తంగా ఉండాలని కార్మికులకు సూచించారు. ఉద్యమాలు, పోరాటాలతోనే సమస్యలు పరిష్కారమవుతాయని అన్నారు. మహాసభకు కానూరి తులసి, దుర్గ అధ్యక్షవర్గంగా వ్యవహరించగా ఆవుల శ్రీనివాస్ కార్యదర్శి నివేదిక ప్రవేశ పెట్టారు. నివేదికపై చర్చల అనంతరం నూతన కన్వీనింగ్ కమిటీని మహాసభ ఎన్నుకుంది. మండల కన్వీనర్‌గా ఎస్.వెంకటేశ్వరరావు ఎన్నికయ్యారు. ఈ మహాసభలో సిఐటియు జిల్లా అధ్యక్షులు జెఎన్‌వి.గోపాలన్, జిల్లా ఉపాధ్యక్షులు బి.వాసుదేవరావు, కౌలు రైతులసంఘం జిల్లా ఉపాధ్యక్షులు కేతా గోపాలన్, ఆశా వర్కర్ల యూనియన్ జిల్లా కార్యదర్శి డి.జ్యోతి, మండల అధ్యక్షుడు నాగిశెట్టి గంగారావు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రాయ్

రైతు సంక్షేమానికి పెద్దపీట : ఎంఎల్ఎ రాధాకృష్ణ

ప్రజాశక్తి - తణుకు

రైతు సంక్షేమానికి కూటమి ప్రభుత్వం పెద్ద పీట వేసినట్లు ఎంఎల్ఎ ఆరిమిల్లి రాధాకృష్ణ అన్నారు. రైతు సంబరాల్లో భాగంగా దాదాపు 200లకు పైగా ట్రాక్టర్లు ర్యాలీగా చంద్రబాబునాయుడుకు కృతజ్ఞతా పూర్వకంగా అభినందనలు తెలియజేస్తూ మంగళవారం తణుకులో భారీ ప్రదర్శన నిర్వహించారు. ఎంఎల్ఎ స్వయంగా ట్రాక్టర్ డ్రైవింగ్ చేస్తూ ఎన్‌టిఆర్ పార్కు నుంచి ప్రారంభమైన ఈ ర్యాలీ మున్సిపల్ కార్యాలయం, ఎన్ఎస్‌సి బోస్ రోడ్డు, వేల్పూరు రోడ్డు, రైల్వేస్టేషన్ రోడ్డు, ఆపిల్ ఆసుపత్రి, రాష్ట్రపతిరోడ్డు, వెంకటేశ్వర థియేటర్ సెంటర్ మీదుగా నరేంద్ర సెంటర్‌కు చేరుకుంది. అక్కడ ఏర్పాటు చేసిన భారీ బహిరంగ సభలో ఎంఎల్ఎ మాట్లాడారు. చంద్రబాబునాయుడు అన్నదాత సుఖీభవ పథకంలో తణుకు నియోజకవర్గంలోని 16,500 మంది రైతులకు రూ.11.50 కోట్లు వారి ఖాతాల్లో, రూ.7 వేలు చొప్పున జమ చేసినట్లు గుర్తు చేశారు. కాలువల్లో, డ్రెయినేజీల్లో పేరుకుపోయిన తూడు తొలగించడానికి ప్రత్యేకంగా నిధులు కేటాయించినట్లు తెలిపారు. రాష్ట్రంలో దాదాపు 60 శాతం మంది వ్యవసాయంపై ఆధారపడిన రైతులకు అన్ని సంక్షేమ పథకాలూ అమలు చేయడానికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు, రైతులు పాల్గొన్నారు.

పారదర్శకంగా ప్రభుత్వ భూముల సర్వే చేయించాలి

కెవిపిఎస్ నేత, మాజీ ఎంఎల్ఎ దిగుపాటి రాజగోపాల్

ప్రజాశక్తి - ఉండి

స్థానిక ఎంఎల్ఎ, డిప్యూటీ స్పీకర్ కనుమూరి రఘురామకృష్ణరాజుకు నియోజకవర్గ అభివృద్ధిపై చిత్తశుద్ధి ఉంటే ప్రభుత్వ స్థలాలు, పోరంబోకు భూములపై పారదర్శకంగా సర్వే చేయించి, గ్రామ పంచాయతీల్లో రికార్డులను ఉంచాలని, అప్పుడు నిజమైన ఆక్రమణదారులు ఎవరో తెలుస్తుందని కెవిపిఎస్ రాష్ట్ర నేత, మాజీ ఎంఎల్ఎ దిగుపాటి రాజగోపాల్ అన్నారు. మంగళవారం పాములపర్రులో వివాదాస్పదమైన దళితుల శ్మశాన భూమిని ఆయన పరిశీలించారు. అనంతరం దళితులు చేపట్టిన నిరసనలకు సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా రాజగోపాల్ మాట్లాడుతూ జస్టిస్ పున్నయ్య కమిషన్ సూచనల మేరకు దళితుల భూములను ఆక్రమించిన వారిపై ఎస్‌సి, ఎస్‌టి అట్రాసిటీ కేసులు నమోదవుతాయన్నారు. జిఒ నెం.1235 ప్రకారం శ్మశాన భూములు లేని దళితులకు రెండెకరాల భూమి కేటాయించాలని డిమాండ్ చేశారు. నియోజకవర్గంలో ఎంఎల్ఎ సుప్రీమ్ అని, ఆయన ఆదేశాలు లేకుండా అధికారులు రికార్డులు తారుమారు చేసే అవకాశం లేదని అన్నారు. నియోజకవర్గ ఎసైన్డ్ కమిటీ ఛైర్మన్‌గా ఉన్న ఎంఎల్ఎ దళితుల శ్మశాన భూములకు రక్షణగా నిలవడం మాని, వారి శ్మశాన భూమిలోంచి సంపన్నులకు, వేరే గ్రామానికి చెందిన వారికి రహదారి వేయాలని చెప్పడం విడ్డూరమన్నారు. గత వారం రోజుల నుంచి దళితులు వివిధ రూపాల్లో తమ నిరసన తెలుపుతుంటే కనీసం ఎంఎల్ఎగాని, కలెక్టర్‌గాని ఇటువైపు కన్నెత్తి చూడకపోవడం దారుణమన్నారు. ఉద్యమం తీవ్రరూపం దాల్చి మరో గరగపర్రు ఉద్యమంలా తయారు కాకుండా ఉండాలంటే జిల్లా కలెక్టర్, స్థానిక ఎంఎల్ఎ పాములపర్రులో పర్యటించి దళితులతో శాంతియుతంగా చర్చలు జరపాలని సూచించారు. స్థానిక గ్రామ పంచాయతీ కార్యదర్శి ఐదో తేదీ వరకు ఒకటిగా ఉన్న శ్మశాన భూమిని రెండుగా మార్చి రికార్డులు తారుమారు చేసి స్థానిక తహశీల్దార్‌కు పంపించారని, దీనిపై అధికారులను వివరణ కోరడానికి మహిళలు పంచాయతీ కార్యాలయానికి వెళ్లగా కార్యదర్శి, గ్రామ రెవెన్యూ అధికారి కార్యాలయం నుంచి ఉడాయించడం వెనుక ఉన్న మర్మమేమిటో నిగ్గు తేల్చాలని కోరారు. నియోజకవర్గంలో సిపిఎం నాయకులు అమ్ముడుపోతారనే తప్పుడు ప్రచారాన్ని కొందరు నాయకులు చేస్తున్నారని, పాములపర్రులో దళితులకు న్యాయం జరగకపోతే అన్ని సంఘాలను ఏకతాటిపైకి తీసుకువచ్చి తమ సత్తా ఏమిటో చూపిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కెవిపిఎస్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు బత్తుల విజయ్, కారుమంచి క్రాంతిబాబు, జిల్లా సహాయ కార్యదర్శులు చిన్నం నాగేశ్వరరావు, మాదాసి గోపి, స్థానిక నాయకులు దానం విద్యాసాగర్, దర్శి పరదేశి, దర్శి సాల్మన్‌రాజు, దర్శి బాబి, దళిత మహిళలు పాల్గొన్నారు.



శ్మశాన భూమిని పరిశీలిస్తున్న దిగుపాటి రాజగోపాల్

విద్యార్థులు లక్ష్యాన్ని ఎంచుకోవాలి

మానసిక విశ్లేషకులు వీడియాల చక్రవర్తి

ప్రజాశక్తి - నరసాపురం

సీతారామపురంలోని స్వర్ణాంధ్ర ఇంజినీరింగ్ కళాశాలలో మొదటి సంవత్సరం బిటెక్ విద్యార్థులకు మంగళవారం ప్రముఖ రచయిత, మానసిక విశ్లేషకులు వీడియాల చక్రవర్తి అవగాహనా సదస్సు నిర్వహించారు. ముఖ్యంగా ఇంజినీరింగ్ విద్యార్థులు లక్ష్యాన్ని ఎంచుకుని, లక్ష్య సాధనకు నిరంతరం కృషి చేయాలన్నారు. ప్రముఖ ఎంట్రప్రెన్యూర్ ఎం.జయరాజ్ కుమార్ మాట్లాడారు. సదస్సులో భాగంగా ఎఐను ఉపయోగించి పారిశ్రామిక వేత్తలుగా ఎలా ఎదగాలో విద్యార్థులకు ఉదాహరణలతో ఆయన వివరించారు. కార్యక్రమంలో కళాశాల ఛైర్మన్ కెవి.సత్యనారాయణ, కళాశాల కోశాధికారి కె.త్రినాథస్వామి, కళాశాల డైరెక్టర్ ఎ.శ్రీహరి, ప్రిన్సిపల్ ఎస్.సురేష్‌కుమార్ పాల్గొన్నారు. అనంతరం ముఖ్యఅతిథులను కళాశాల యాజమాన్యం సత్కరించారు.

చంద్రబాబుతో కొవ్వలి భేటీ

ప్రజాశక్తి - నరసాపురం

టిడిపి అధినేత, సిఎం చంద్రబాబును అమరావతిలో మంగళవారం నరసాపురానికి చెందిన టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి, కొవ్వలి ఫౌండేషన్ ఛైర్మన్ కొవ్వలి యతిరాజ రామ్మోహన్‌నాయుడు మర్యాద పూర్వకంగా కలిశారు. చంద్రబాబుకు రామ్మోహన్‌నాయుడు పుష్పగుచ్ఛం అందజేశారు. అనంతరం ఇరువురు పలు రాజకీయ అంశాలపై చర్చించారు. నియోజకవర్గంలోని పలు సమస్యలను కొవ్వలి రామ్మోహన్‌నాయుడు చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లారు. పార్టీ బలోపేతానికి కృషి చేయాలని, ప్రభుత్వ పథకాలు ప్రజల్లో విస్తృత ప్రచారం చేయాలని చంద్రబాబు కొవ్వలికి సూచించారు. కార్యక్రమంలో రాష్ట్ర మైనారిటీ వ్యవహారాల ప్రభుత్వ సలహాదారు ఎం.ఎ.షరీఫ్ పాల్గొన్నారు.



సిఎం చంద్రబాబుతో మాట్లాడుతున్న కొవ్వలి నాయుడు, పక్కన షరీఫ్

విద్యార్థులు ఉన్నత శిఖరాలు అధిరోహించాలి

ప్రజాశక్తి - ఉండి

విద్యతో భవిష్యత్తులో ఉన్నత శిఖరాలు అధిరోహించవచ్చని ఉండి లయన్స్ క్లబ్ అధ్యక్షులు గాదిరాజు రంగరాజు, పి.రంగప్రసాద్ రాజు అన్నారు. మంగళవారం ఉండి హైస్కూల్లో ఇంటర్ రెండో సంవత్సరం చదువుతున్న మెరిట్ విద్యార్థిని ఆకేటి శైలజకు 25 వేల రూపాయల ఆర్థిక సహాయాన్ని పాఠశాల ప్రధానోపాధ్యాయుని ఏలూరుపాటి రామలక్ష్మి ఆధ్వర్యంలో క్లబ్ సభ్యులు అందజేశారు. ఈ సందర్భంగా ఏలూరుపాటి రామలక్ష్మి మాట్లాడుతూ మెరిట్ విద్యార్థులను ప్రోత్సహించడంలో లయన్స్ క్లబ్ ముందుంటుందని తెలిపారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ సభ్యులు, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థులకు యూనిఫారాలు అందజేత

ప్రజాశక్తి - గణపవరం

గణపవరం జూనియర్ కాలేజీ విద్యార్థులకు పేరిచర్ల సింగరాజు వెంకట సుబ్బయ్య ట్రస్ట్ ఆధ్వర్యంలో 60 వేల రూపాయల విలువైన యూనిఫారాలను గణపవరం సొసైటీ అధ్యక్షులు కనుమూరి సురేందర్ కుమార్‌రాజు మంగళవారం అందజేశారు. ఈ సందర్భంగా కాలేజీ ప్రిన్సిపల్ శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ తమ కాలేజీ విద్యార్థులకు యూనిఫారం అందజేసిన సింగరాజు సుబ్బయ్య ట్రస్ట్ వారికి ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

యాచకులకు పండ్లు అందజేత

ప్రజాశక్తి - గణపవరం

గణపవరం లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో మంగళవారం మార్కెట్‌లోని యాచకులకు క్లబ్ నాయకులు పండ్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న క్లబ్ అధ్యక్ష కార్యదర్శులు వెలగాడి నరేష్, కిలారి రవిబాబు మాట్లాడుతూ యాచకులు, పేదలకు ఆహారం అందించే విషయంలో క్లబ్ మాజీ అధ్యక్షులు నడంపల్లి రామకృష్ణ కుటుంబ సభ్యులు నడంపల్లి రాంపండు కుమారుడు పండ్లు అందజేశారు. కోశాధికారి కె.సత్యనారాయణ మూర్తి, రామకృష్ణ కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

వైఎన్‌లో క్విజ్ పోటీలు

ప్రజాశక్తి - నరసాపురం

స్థానిక వైఎన్ కళాశాల ఇంగ్లీష్ క్లబ్, ఆంగ్ల విభాగం, టేలర్ హైస్కూల్ పూర్వ విద్యార్థుల సంఘం సింధిసిస్ వారి సంయుక్త ఆధ్వర్యంలో మంగళవారం క్విజ్ పోటీలు నిర్వహించారు. ఇంగ్లీష్ క్లబ్ సమన్వయ కర్త, కమ్యూనికేషన్ స్కిల్స్ ట్రెయినర్ ఎం.సారంగపాణి మాట్లాడుతూ ఈ పోటీలు పట్టణ స్థాయిలో వివిధ కళాశాలల మధ్య నిర్వహిస్తున్నామన్నారు. మూడు రోజులుగా జరుగుతున్నాయని, చివరి రోజు మంగళవారం సూర్య కళాశాల విద్యార్థులు మొదటి స్థానాన్ని పొందారని తెలిపారు. 'ఎ' టీమ్ విజేతగా, 'సి' టీమ్ రెండో స్థానాన్ని పొందిందని తెలిపారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ అండే రామ్ సతీష్ మాట్లాడుతూ వైఎన్ కళాశాల విద్యార్థులు మొదటి, రెండు స్థానాలు గెలుచుకోవడం చాలా ఆనందదాయకం అన్నారు. అనంతరం విజేతలైన వారికి బహుమతి ప్రదానం చేశారు. కళాశాల ప్రిన్సిపల్ చింతపల్లి కనకారావు, డీన్ ప్రొఫెసర్ గంధం శ్రీ రామకృష్ణ, మేనేజ్మెంట్ స్టడీస్ హెడ్ ప్రొఫెసర్ రంగినీడి పార్థసారథి, హెచ్‌ఆర్‌డి డైరెక్టర్ ప్రొఫెసర్ వినిమిల్లి శ్రీనివాస్, ఎంసిఎ హెడ్ పితాని శ్యాంబాబు, ఇంగ్లీష్ డిపార్ట్మెంట్ హెడ్ చింతా సోమేశ్వర పాల్గొన్నారు.

యువతకు కంప్యూటర్ శిక్షణ

ప్రజాశక్తి - నరసాపురం

రుస్తుంబాదలోని లేసు పార్కులో యువతకు కంప్యూటర్ శిక్షణ తరగతులు మంగళవారం నుంచి నెక్ ప్రాక్ట్ నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో రెండు నెలల పాటు నిర్వహిస్తున్నట్లు డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్ కో-ఆర్డినేటర్ శ్రీనివాస్ తెలిపారు. కంప్యూటర్ శిక్షణ తరగతుల్లో 20 మంది యువత పాల్గొంటున్నారన్నారు. శిక్షణ ఉదయం నుంచి మధ్యాహ్నం 2.30 గంటల వరకు కొనసాగుతుందన్నారు.

పలు గ్రామాల్లో 'పొలం పిలుస్తోంది'

ప్రజాశక్తి - నరసాపురం

మండలంలోని మల్లవరం, కంసాలి బేతపూడి గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సహాయ వ్యవసాయ సంచాలకులు పివివిఎన్ఎస్‌పిఎన్.ప్రసాద్ ఎరువుల యాజమాన్యం గురించి వివరించారు. సార్వాలో ఎకరాకు 78 కిలోల యూరియా, 150 కిలోల సూపర్, 40 కిలోల పోటాష్ వాడాలని సూచించారు. యూరియా మూడు దఫాల్లో వేయాలని, ఆఖరి దమ్ములో మాత్రమే సూపర్ వేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎఇఒ లక్ష్మీనారాయణ, వివిఎ.యశస్విని, రైతులు బాణం వెంకటేశ్వర్లు, మద్దిశెట్టి నాగేశ్వరరావు, కౌరు శ్రీను పాల్గొన్నారు.

పెనుమంట్ర: మండలంలోని రైతులందరూ ఫసల్ బీమా యోజన పథకం కింద తమ పంటలకు బీమా విధిగా చేయించుకోవాలని మండల వ్యవసాయ అధికారి బి.దేవీ స్వరూప కోరారు. మంగళవారం జుత్తిగలో జరిగిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో పాల్గొని ఆమె మాట్లాడారు. వ్యవసాయ శాఖ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

దేవాలయం అభివృద్ధి అభినందనీయం

ప్రజాశక్తి - తణుకు

దాతలు, గ్రామస్తుల సహకారంతో యల్లారమ్మ దేవాలయాన్ని అభివృద్ధి చేసుకోవడం అభినందనీయమని ఎంఎల్ఎ ఆరిమిల్లి రాధాకృష్ణ అన్నారు. మండపాక యల్లారమ్మ ఆలయంలో పిచ్చికల కోటేశ్వరరావు, లక్ష్మి దంపతులు రూ.2.50 లక్షలతో నిర్మించిన మండపాన్ని, బలుసు కేశవస్వామి, పార్వతి దంపతుల పేరుతో ఎన్టీఆర్ సుజల స్రవంతిలో భాగంగా నిర్మించిన వాటర్‌ప్లాంటు, విశ్రాంతి, ప్రసాదాల వితరణ హాల్‌ను ఎంఎల్ఎ ప్రారంభించి మాట్లాడారు. 2014 - 19 హయాంలో తాను ఎంఎల్ఎగా ఉన్న సమయంలో ఏర్పాటు చేసిన అన్నదాన కమిటీ ద్వారా దేవాలయ ప్రాంగణంలో నిత్యాన్నదాన కార్యక్రమాన్ని కొనసాగించడం అభినందనీయమన్నారు. ఆలయ కమిటీ సభ్యులతోపాటు కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రక్తదానం ప్రాణదానంతో సమానం

గణపవరం: రక్తదానం ప్రాణదానంతో సమానమని గణపవరం డిగ్రీ కాలేజీ ప్రిన్సిపల్ పి.నిర్మలాకుమారి అన్నారు మంగళవారం కాలేజీలో ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని ఆమె ప్రారంభించి మాట్లాడారు. శిబిరంలో స్వచ్ఛందంగా రక్తదానం చేసిన విద్యార్థులను నిర్మలాకుమారి అభినందించారు. రెడ్‌క్రాస్ సొసైటీ పిఆర్ఒ కెవి.రమణ మాట్లాడుతూ సేకరించిన రక్తాన్ని తలసేమియా వ్యాధిగ్రస్తులకు ప్రతినెలా అందచేయడం జరుగుతుందని చెప్పారు. శిబిరంలో 16 మంది విద్యార్థులు 250 మిల్లీలీటర్ల రక్తాన్ని ఇవ్వడం జరిగిందని నిర్మలాకుమారి తెలిపారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ కె.స్వరూపరాణి, కాలేజీ సిబ్బంది పాల్గొన్నారు.

సెప్టెంబర్ 13న జాతీయ లోక్ అదాలత్

నరసాపురం: సెప్టెంబర్ 13న నరసాపురంలోని అన్ని కోర్టు సముదాయాల్లో జాతీయ లోక్ అదాలత్ నిర్వహించనున్నట్లు నర్సాపురం 10వ అదనపు జిల్లా జడ్జి, ఛైర్‌పర్సన్ ఎ.వాసంతి తెలిపారు. ఆయా కోర్టుల్లో ఉన్న రాజీపడదగిన అన్ని క్రిమినల్, కుటుంబ తగాదాలు, సివిల్, భూ తగాదాలు, చెక్ బౌన్స్ కేసులు, మోటార్ వాహన ప్రమాద నష్టపరిహార తదితర కేసులు రాజీ చేసుకోవచ్చని తెలిపారు. ఈ అవకాశాన్ని కక్షిదారులు సద్వినియోగం చేసుకునేందుకు వారి న్యాయవాదుల ద్వారా గాని, సంబంధిత పోలీసు వారిని లేదా కోర్టు ప్రాంగణంలో ఉన్న న్యాయ సేవాధికార సంస్థను గానీ సంప్రదించగలరని తెలిపారు. బ్యాంకు, బిఎస్ఎన్ఎల్‌కు సంబంధించిన లావాదేవీలు ప్రి లిటిగేషన్ కేసుల కింద సెటిల్ చేసుకోవచ్చని తెలిపారు.

తండ్రి బాటలో తనయుడు

కాళ్లకూరు సొసైటీ అధ్యక్షుడు దండు ప్రణవమూర్తి రాజు

ప్రజాశక్తి - కాళ్ల

కాళ్లకూరు సొసైటీ అభివృద్ధిలో దండు కుటుంబీకుల పాత్ర ఉందని కాళ్లకూరు సొసైటీ అధ్యక్షుడు దండు ప్రణవమూర్తి రాజు తెలిపారు. ప్రజాశక్తికి ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన మాట్లాడుతూ తన తండ్రి దండు సత్యనారాయణరాజు 1981-85 వరకూ నాలుగేళ్ల పాటు సొసైటీ ఛైర్మన్‌గా పనిచేశారని తెలిపారు. సొసైటీలో ఎరువుల వ్యాపారాన్ని ప్రారంభించారన్నారు. ఆయన హయాంలోనే సంఘం రుణాలు పెరిగాయన్నారు. 100 ఎంటి, 50 ఎంటి గోదాములను నిర్మించారన్నారు. సొసైటీ సిబ్బందికి క్వార్టర్స్ నిర్మించారన్నారు. సొసైటీ అభివృద్ధిలో


దండు సత్యనారాయణరాజు


దండు ప్రణవమూర్తిరాజు

ఆయన కీలక పాత్ర పోషించారన్నారు. గత 40 ఏళ్ల పాటు టిడిపిలో కొనసాగుతున్నారన్నారు. తండ్రి బాటలో నడిచేందుకు కృషి చేస్తున్నానని తెలిపారు. రైతుల సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. సహకార బ్యాంకు ద్వారా పార్టీల కతీతంగా రైతులకు సేవలు అందిస్తామన్నారు. బ్యాంకును అభివృద్ధి పథంలో నడిపించేందుకు కృషి చేస్తానన్నారు. రైతులకు అవసరమైన రుణాలు ఎప్పటికప్పుడు అందిస్తూ వారి అభివృద్ధికి దోహదపడతా మన్నారు. డిప్యూటీ స్పీకర్ కనుమూరు రఘురామ కృష్ణరాజు సహకారంతో రైతుల అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు. సభ్యులు, సిబ్బంది సహకారంతో సొసైటీని మరింత అభివృద్ధి చేస్తానని తెలిపారు.

యువత దేశభక్తిని పెంచుకోవాలి

ప్రజాశక్తి - ఉండి

విద్యార్థులు, యువత దేశభక్తిని పెంపొందించుకోవాలని క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ పేరిచర్ల శ్రీనివాసరాజు (సుభాష్ రాజు) అన్నారు. మంగళవారం కోలమూరులో 79వ స్వాతంత్ర దినోత్సవ వేడుకలను పురస్కరించుకుని నిర్వహించిన హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా 200 అడుగుల జాతీయ జెండాను పేరిచర్ల శ్రీనివాసరాజు ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఎంతో మంది ప్రాణ త్యాగంతో మనకు స్వాతంత్రం వచ్చిందన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు గాదిరాజు వెంకటేశ్వరరాజు, యర్రా విక్రమ్, గాజుల శివ, మడిచర్ల సూర్య ప్రకాష్, చింతాడ మహేష్, రుద్రరాజు నరసింహరాజు పాల్గొన్నారు.

పెనుమంట్ర : పొలమూరు నుంచి మార్టేరు సెంటర్ వరకూ స్వాతంత్ర దినోత్సవ ఉత్సవాల్లో భాగంగా కూటమి ఆధ్వర్యంలో మంగళవారం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకూ మోటారు వాహనాలతో తిరంగా యాత్ర జరిగింది. నాయకులు జాతీయ పతకాలు చేపట్టి నినాదాలు చేశారు. ఈ యాత్రలో టిడిపి క్లస్టర్ కో ఆర్డినేటర్ చింతపల్లి రామకృష్ణ, కూటమి నాయకులు జి.పుల్లాజీ, రవి, విశ్వనాథం, గోవిందాచార్యులు, తోరం వెంకన్నబాబు, కండిబోయిన శ్రీనివాస్ పాల్గొన్నారు.

పాలకొల్లు : మంగళవారం కెనాల్ రోడ్డులోని గాంధీ బొమ్మల సెంటర్ నుంచి యడ్ల బజార్ వరకూ తిరంగా యాత్ర నిర్వహించారు. బిజెపి పట్టణ అధ్యక్షులు కొల్లి కొండా ప్రసాద్ ఆధ్వర్యంలో ఎఎస్ఎన్ఎం ప్రభుత్వ


వేంద్ర లో ర్యాలీ చేస్తున్న విద్యార్థులు

కాలేజీ విద్యార్థులచే వంద మీటర్ల జాతీయ జెండా, 100 జాతీయ జెండాలతో తిరంగా యాత్రలి విజయవంతంగా నిర్వహించారు. పట్టణ అధ్యక్షులు కొల్లి కొండా ప్రసాద్, కృష్ణా జిల్లా ఇన్‌ఛార్జి ఉన్నమట్ల కబర్ధి, జిల్లా వైస్ ఛైర్మన్ యర్రంశెట్టి పద్మారావు, డిఆర్‌యుసిసి మెంబర్ జక్కంపూడి కుమార్ పాల్గొన్నారు. కృష్ణవర్మ మాట్లాడుతూ దేశ స్వాతంత్రం కోసం తమ ప్రాణాలు అర్పించిన స్వాతంత్ర్య సమరయోధులను ప్రజలందరూ స్మరించుకోవాలన్నారు.

వీరవాసరం : వీరవాసరంలో తిరంగా యాత్ర నిర్వహించారు. వీరవాసరం పంచాయతీ కార్యాలయం నుంచి బస్టాండ్ సెంటర్ వరకూ యాత్ర నిర్వహించారు. ఈ యాత్రలో మండల పరిషత్ కార్యాలయం ఏర్పాటు చేసిన 100 అడుగుల త్రివర్ణ పతాకాన్ని భారతి పబ్లిక్ స్కూల్ విద్యార్థులు చేపట్టి యాత్రలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచి చికిలే మంగతాయారు, ఎంపిపి వీరవల్లి దుర్గాభవాని, వీరవల్లి చంద్రశేఖర్, ఆదిరెడ్డి గంగారావు, వివిధ పార్టీల నాయకులు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

పాలకోడేరు : స్వాతంత్ర సంగ్రామంలో ఎంతోమంది ప్రాణాలు కోల్పోయారని వారి ఆశ సాధనకు అనుగుణంగా దేశాన్ని ఉన్నత స్థితిలో నిలపాలని వేంద్ర పంచాయతీ కార్యదర్శి కృష్ణమోహన్ అన్నారు. ఆజాదికా అమృత్ మహోత్సవంలో భాగంగా హర్ ఘర్ తిరంగా ర్యాలీని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు, విద్యార్థులు, పంచాయతీ సిబ్బంది రాలీలో పాల్గొని దేశ గొప్పతనాన్ని చాటి చెప్పారు. అనంతరం పంచాయతీ కార్యదర్శి కృష్ణమోహన్ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా చేపట్టిన ఈ కార్యక్రమం విజయవంతంగా సాగుతుందన్నారు. ముఖ్యంగా ప్రజానీకం దేశ గొప్పతనాన్ని తెలుసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

తాడేపల్లిగూడెం : ఎందరో స్వాతంత్ర సమరయోధుల త్యాగఫలం వల్ల భారత దేశ స్వాతంత్రాన్ని నేడు మనం అనుభవిస్తున్నామని ఎంఎల్ఎ బొలిశెట్టి శ్రీనివాస్ అన్నారు. నియోజకవర్గ కూటమి నాయకులు, కార్యకర్తలు వీర మహిళలతో కలిసి ఎంఎల్ఎ తిరంగా భారీ బైక్ ర్యాలీలో పాల్గొన్నారు. ఈ ర్యాలీని హౌసింగ్ బోర్డు ఎస్‌వి.రంగారావు విగ్రహం నుంచి పోలీస్ ఐలాండ్ వరకూ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తమ ఇంటిపై జాతీయ జెండాను ఎగురవేయాలన్నారు. మున్సిపల్ కమిషనర్ ఏసుబాబు మాట్లాడారు. కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

డిగ్రీ కళాశాలలో ఆర్‌జెడి తనిఖీలు

గణపవరం: స్థానిక డిగ్రీ కళాశాలలో ఆర్‌జెడి పివి.కృష్ణాజీ మంగళవారం తనిఖీలు నిర్వహించారు. ఫైళ్లను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం కళాశాల నిర్వహణ, గార్డెన్, గ్రౌండ్ నిర్వహణపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కళాశాలను బాగా నిర్వహిస్తున్నారని ప్రిన్సిపల్ పి.నిర్మలాకుమారిని, అధ్యాపకులను ఆయన అభినందించారు.

ఎడిఎగా ప్రసాద్ బాధ్యతలు

నరసాపురం: వ్యవసాయ శాఖ ఎడిఎగా పివివిఎన్ఎస్‌పి.ప్రసాద్ మంగళవారం బాధ్యతలు చేపట్టారు. ఆయన నిడదవోలు బయోలాజికల్ ల్యాబ్ నుంచి ఇక్కడికి బదిలీపై వచ్చారు. ఇప్పటి వరకూ ఇన్‌ఛార్జి ఎడిఎగా రహీమ్ కొనసాగారు. బాధ్యతలు చేపట్టిన ఆయనను ఎఒలు, ఎఇఒలు, సిబ్బంది అభినందించారు. అనంతరం విలేకర్లతో మాట్లాడారు. రైతులకు నిరంతరం అందుబాటులో ఉంటానని తెలిపారు. సాగులో రసాయనిక ఎరువులు, పురుగుల మందులు తగ్గించే విధంగా రైతుల్ని చైతన్యపరుస్తామన్నారు.

గ్రంథాలయ వనరులను వినియోగించుకోవాలి

ప్రజాశక్తి - పాలకొల్లు

అద్దేపల్లి సత్యనారాయణ మూర్తి ప్రభుత్వ స్వయం ప్రతిపత్తి కళాశాలలో మంగళవారం కళాశాల గ్రంథాలయ విభాగం వారు జాతీయ గ్రంథ పాలకుల దినోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన కళాశాల ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్ టి.కృష్ణ, కళాశాల ఐక్యూఎసి కోఆర్డినేటర్ కె.భద్రాచలం మాట్లాడుతూ గ్రంథాలయంలోని వనరులను విద్యార్థులందరూ వినియోగించుకోవాలన్నారు. కళాశాల తెలుగు విభాగాధిపతి బి.వెంకటస్వామి మాట్లాడారు. లైబ్రేరియన్ వివిసి హెచ్.రమేష్, కంప్యూటర్ సైన్స్ అధ్యాపకులు కె.దశరథ్, అధ్యాపకులు పాల్గొన్నారు.

సహజ సిద్ధమైన వనరులతో స్వయం ఉపాధి

కాళ్ల: గ్రామీణ ప్రాంతాల్లో నీటి వనరుల్లో లభ్యమయ్యే సహజ సిద్ధమైన వనరులను సద్వినియోగం చేసుకుంటే గ్రామీణ యువత ఎన్నో స్వయం ఉపాధి పథకాలు చేపట్టొచ్చని భీమవరం ఎస్ఆర్‌కెఆర్ ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ కెవి.మురళీకృష్ణంరాజు పేర్కొన్నారు. భీమవరం ఎస్ఆర్‌కెఆర్ ఇంజినీరింగ్ కళాశాల సైన్స్ అండ్ టెక్నాలజీ ఇన్నోవేషన్ హబ్ (ఎస్‌టిఐహబ్) కేంద్ర ప్రభుత్వం సైన్స్ అండ్ టెక్నాలజీ (డిఎస్‌టి) సహకారంతో జక్కరం పంచాయతీ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన అవగాహన సదస్సు మంగళవారం నిర్వహించారు. ఈ సదస్సుకు ఎస్‌టిఐ హబ్ ప్రిన్సిపల్ ఇన్వెస్టిగేటర్ జి.హరీష్ కుమార్ వర్మ అధ్యక్షత వహించారు. మురళీకృష్ణంరాజు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో చెరువుల్లో పంట కాలవలు లభ్యమయ్యే గుర్రపుడెక్కలో ఎన్నో సహజ సిద్ధమైన ఔషధ గుణాలు ఉన్నాయన్నారు. కార్యక్రమంలో జక్కరం గ్రామ సర్పంచి కె.పద్మావతి, కార్యదర్శి బి.శ్రీనివాసరావు, ఎస్‌టిఐ హబ్ కో-ప్రిన్సిపల్ ఇన్వెస్టిగేటర్ సిహెచ్ రామభద్రరాజు పాల్గొన్నారు.

విద్యాసామగ్రి అందజేత

వీరవాసరం : వీరవాసరం గాంధీ బజార్ వీధిలో ఎలిమెంటరీ స్కూల్లోని విద్యార్థులకు మంగళవారం నోట్ బుక్స్, పెన్నులు, బిస్కెట్లు అందజేశారు. వీరవాసరం కాపు సర్వీస్ క్లబ్, వనిత క్లబ్ ఆధ్వర్యంలో వీటిని పంపిణీ చేశారు. వీరవాసరంలో 6 ఎలిమెంటరీ స్కూల్ విద్యార్థులకు బుక్స్ పంపిణీ చేసినట్లు క్లబ్ అధ్యక్షుడు గుండా రామకృష్ణ తెలిపారు. ఆగస్టు 15 సందర్భంగా హై స్కూల్లో వ్యాసరచన పోటీలు ఏర్పాటు చేస్తామన్నారు. వనిత క్లబ్ అధ్యక్షురాలు బి.లక్ష్మీకళ్యాణి, సభ్యులు కుంచె వేణు, అనిశెట్టి అన్నపూర్ణ, బృందావనం నాగేంద్ర పాల్గొన్నారు.

వనవులమ్మ దేవస్థానం ఛైర్మన్‌గా వెంకన్నబాబు

ఆకివీడు: వనవులమ్మ దేవస్థానం ట్రస్ట్ బోర్డు ఛైర్మన్‌గా టిడిపి నాయకులు కొల్లి వెంకన్నబాబు నియమితులయ్యారు. ఈ మేరకు కమిషనర్ కార్యాలయం నుంచి ఆయనకు ఆదేశాలు అందాయి. ట్రస్ట్ బోర్డు సభ్యులుగా బి.నాగదుర్గ, ఎ.సుబ్రహ్మణ్యం, డి.విజయ్ కుమార్, జి.మణి, బి.అశోక్‌కుమార్, టి.పేరంటాలు, కె.విజయ, టి.రత్నకుమారితోపాటు ఎక్స్ అఫీషియ సభ్యులుగా దేవస్థానం అర్చకులు ఎల్.నరసింహారావు నియమితులయ్యారు. మరో రెండు రోజుల్లో బాధ్యతలు చేపట్టనున్నట్లు టిడిపి మండల అధ్యక్షులు మోటుపల్లి రామవరప్రసాద్ తెలిపారు.

14న వాలీబాల్ జట్ల ఎంపిక

ప్రజాశక్తి - వీరవాసరం

ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా అండర్-15 వాలీబాల్ (బాలురు, బాలికల) జట్ల ఎంపిక ఈ నెల 14న ఉదయం 9 గంటలకు ఏలూరులోని అల్లూరి సీతారామరాజు స్టేడియంలో జరుగుతుందని ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల పాఠశాల క్రీడా కార్యదర్శులు కె. అలివేలుమంగ, పిఎస్ఎన్.మల్లేశ్వరరావు మంగళవారం తెలిపారు. చైనాలో ఈ ఏడాది డిసెంబర్ 4 నుండి 13 వరకు జరగబోయే ప్రపంచ పాఠశాల వాలీబాల్ ఛాంపియన్‌షిప్‌లో పాల్గొనే జాతీయ జట్ల ఎంపికకు రాష్ట్ర స్థాయిలో, జిల్లాస్థాయిలో జట్లను ఎంపిక చేస్తున్నట్లు వివరించారు. జిల్లా జట్లు, రాష్ట్ర జట్లలో 8 మంది బాలురు, 8 మంది బాలికలను ఎంపిక చేస్తారన్నారు. జాతీయ స్థాయిలో బలేవాడి, పుణెలో జరిగే పోటీల్లో రాష్ట్ర జట్లు పాల్గొంటాయని తెలిపారు. ఈ ఎంపికకు పాస్‌పోర్టు కలిగి 2010, 2011, 2012, 2013 సంవత్సరాల్లో పుట్టిన వారు మాత్రమే అర్హులన్నారు. రాష్ట్ర జట్ల ఎంపికను విజయవాడలోని కెబిసి జెడ్‌పి బాలుర ఉన్నత పాఠశాలలో ఈ నెల 18 న నిర్వహిస్తారని చెప్పారు.

15న వ్యాసరచన పోటీలు

ప్రజాశక్తి - ఆకివీడు

విద్యార్థుల్లో దేశభక్తిని పెంపొందింపజేయడానికి ఆగస్టు 15వ తేదీ స్వాతంత్ర దినోత్సవం సందర్భంగా స్వాతంత్ర సమరయోధులపై విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహిస్తున్నామని బాలోత్సవ కమిటీ ఛైర్మన్ న్యాయవాది నెల్లి సతీష్ కుమార్ తెలిపారు. విద్యార్థికి నచ్చిన స్వాతంత్ర సమరయోధులు అనే అంశంపై బాలోత్సవ్ కమిటీ ఆధ్వర్యంలో లయన్స్ క్లబ్, శాఖాగ్రంథాయం, హైందవ శంఖారావం సంస్థల సహకారంతో ఒకటి నుంచి పదో తరగతి వరకూ చదువుతున్న విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. ఆసక్తి గల విద్యార్థులు స్థానిక మాదివాడలోని శాఖ గ్రంథాలయంలో తమ పేర్లు నమోదు చేయించుకోవాలన్నారు. మీకు నచ్చిన స్వాతంత్ర సమరయోధుని జీవిత విశేషాలను రాసి గ్రంథాలయంలో అందజేయాలని తెలిపారు. విజేతలకు15వ తేదీన జరిగే కార్యక్రమంలో బహుమతులుఅందజేస్తామన్నారు.

నులిపురుగు నివారణా మాత్రలు వేసుకోవాలి

ప్రజాశక్తి - ఉండి

ప్రతి విద్యార్థీ నులిపురుగు నివారణా మాత్రలు తీసుకోవడం వల్ల రక్తహీనత తగ్గి ఆరోగ్యవంతులవుతారని ఉండి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ పి.లక్ష్మి సునంద, యండగండి పిహెచ్‌సి వైద్యాధికారి డాక్టర్ బిన్నీ శామ్యూల్ అన్నారు. మంగళవారం జాతీయ నులిపురుగుల నిర్మూలనా దినోత్సవం సందర్భంగా ఉండి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. పిహెచ్‌సి పరిధిలోని 19 సంవత్సరాలలోపు వయస్సు గల బాలబాలికలు 5,161 మంది ఉండగా 4,933 మందికి నులిపురుగు నివారణ మాత్రలు ఇవ్వడం జరిగిందన్నారు. యండగండి పిహెచ్‌సి పరిధిలో 5,658 మంది విద్యార్థులు ఉండగా 5428 మందికి అందజేసినట్లు తెలిపారు. యండగండి పిహెచ్‌సి వైద్యులు ఐసి కీర్తన, ఉండి సిహెచ్‌ఒ కృష్ణ కుమార్, యండగండి సిహెచ్‌ఒ వెంకటేశ్వరరావు, కుమారి పాల్గొన్నారు.

గణపవరం : ఆల్బెండజోల్ మాత్రలతో నులిపురుగుల నివారణ అవుతుందని గణపవరం పిప్పర డాక్టర్లు ఎం.ఓంకార్ నాద్ శ్రీదివ్య అన్నారు. జాతీయ నులిపురుగుల నివారణా దినోత్సవం సందర్భంగా గణపవరం, పిప్పరలోని పాఠశాలలు, కాలేజీల విద్యార్థులకు మాత్రలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి విద్యార్థీ అరు నెలలకోసారి ఆల్బెండజోల్ మాత్రలు వేసుకోవాలన్నారు. ఎంపిడిఒ ఆర్.బేబిశ్రీలక్ష్మి, సిహెచ్‌ఒ జాలాది విల్సన్‌బాబు, ఆసుపత్రుల వైద్య సిబ్బంది పాల్గొన్నారు. ఆరోగ్యమైన పిల్లల కోసం నులిపురుగును నలిపివేద్దామని పిఎంపి జిల్లా అధ్యక్షులు ఎఆర్‌కె.పరమేశ్వర్లు అన్నారు. కాశిపాడు హైస్కూలు విద్యార్థులకు నులిపురుగు నివారణ మాత్రలు అందజేశారు. ప్రధానోపాధ్యాయులు చల్లా కృష్ణ ఉపాధ్యాయులు శ్రీనివాస్‌రావు, డిఎల్‌వి పార్వతి పాల్గొన్నారు.

ఆకివీడు : పెదకాపవరం పిహెచ్‌సి వైద్యులచే డి వార్మింగ్ మందుల పంపిణీ జరిగింది. గ్రామంలోని జెడ్‌పి హైస్కూల్లో ఈ కార్యక్రమాన్ని ఎంపిపి రాజ్యలక్ష్మి ప్రారంభించారు. అనంతరం మండలంలోని పలు ప్రాథమిక, జిల్లా పరిషత్ పాఠశాలల్లోనూ, అంగన్వాడీలో ఈ నులిపురుగు మందులు పంపిణీ చేశారు. మండలంలో 6073 మంది లక్ష్యం కాగా మంగళవారం 5906 మంది విద్యార్థులకు ఈ టాబ్లెట్లు వేశామని సిహెచ్‌ఒ జివి రమణ, ఎం.రమేష్ తెలిపారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ సుభాన్ బెగ్, నాగమణి, జెడ్‌పి హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు ఎఎన్‌వి సత్యనారాయణ పాల్గొన్నారు.

ఆచంట : నులిపురుగుల నివారణకు ఆల్బెండజోల్ మాత్రలు తప్పనిసరిగా మింగించాలని వైద్యాధికారులు కె.హైందవి, ఎస్.వినోద్ అన్నారు. వల్లూరు, ఆచంట వేమవరం పిహెచ్‌సిల పరిధిలోని అంగన్వాడీ కేంద్రాలు, ప్రభుత్వ, ప్రయివేటు పాఠశాలలో ఒకటి నుండి 19 సంవత్సరాల వయసు గల విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలను పంపిణీ చేసినట్లు వైద్యాధికారులు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. వైద్యసిబ్బంది, అంగన్వాడీ, ఆశాలు పాల్గొన్నారు.

పాలకొల్లు రూరల్ : లంకలకోడేరు పిహెచ్‌సి పరిధిలో ఎం.నవ్య జీవన్ ఆధ్వర్యంలో నులి పురుగుల నివారణ కార్యక్రమం నిర్వహించారు. హైస్కూలు, ప్రాథమిక పాఠశాలలు, అంగన్వాడీ కేంద్రాలు, ప్రయివేటు స్కూళ్లలోని 1 నుంచి 19 సంవత్సరాల వయసు గల వారికి ఆల్బెండజోల్ మాత్రలు వేశారు. ప్రస్తుతం 97 శాతం పూర్తిచేశామని తెలిపారు. అర్ధకట్ల హైస్కూల్‌లో జరిగిన కార్యక్రమాన్ని రాష్ట్ర నోడల్ అధికారి భార్గవి, జిల్లా డిపిఎంఒ డాక్టర్ సిహెచ్.ధనలక్ష్మి పరిశీలించారు. ఆరోగ్య విస్తరణాధికారి గుడాల హరిబాబు, పిహెచ్‌ఎన్ పి.ఎలిజిబెత్, సూపర్‌వైజర్ ఎస్‌కె.అమలేశ్వరరావు, ప్రధానోపాధ్యాయులు జి.జనార్దన్‌రావు, డిఎన్‌వి.సత్యనారాయణ పాల్గొన్నారు.

పెనుమంట్ర : మార్టేరు సెక్టర్ పరిధిలో అంగన్వాడీ కేంద్రాల్లో నులి పురుగుల నివారణా కార్యక్రమం నిర్వహించారు. స్థానిక శిశు సంక్షేమ శాఖ ప్రాజెక్ట్ అధికారి అంగర కృష్ణకుమారి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. ఏటా ఆగస్టు 10 నుండి 12వ తేదీ వరకూ జాతీయ నులిపురుగుల దినోత్సవ కార్యక్రమాలు జరుగుతాయన్నారు. అపరి శుభ్రమైన ఆహారం, కలుషిత నీరు, పారిశుధ్య లోపం వల్ల నులి పురుగులు వ్యాపిస్తాయని తెలిపారు. వైద్య సిబ్బంది, అంగన్వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

మొగల్తూరు : ప్రతి విద్యార్థికీ నులిపురుగు నివారణ మాత్రలు వేయాలని ఎంపిడిఒ సిహెచ్ త్రిశూలపాణి సిబ్బందికి సూచించారు. మండలంలోని గ్రామాల్లోని అన్ని పాఠశాల విద్యార్థులకూ నులిపురుగు నివారణ మాతలు పంపిణీ చేసి వేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. పిహెచ్‌సి డాక్టర్ కె.లక్ష్మీపార్వతి మాట్లాడుతూ మండలంలోని 9,389 మంది చిన్నారులకు గాను 9,125 మందికి మాత్రలు వేశామని తెలిపారు.

కాళ్ల : ఆల్బెండజోల్ మాత్రలతో రక్తహీనత తగ్గుతుందని ఐసిడిఎస్ సిడిపిఒ వాణీవిజయరత్నం అన్నారు. కోపల్లె అంగన్వాడీ కేంద్రంలో చిన్నారులకు ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేశారు. కోపల్లె ఉపసర్పంచి వెంకట పర్రాలు మాట్లాడుతూ పిల్లలంతా పరిశుభ్రత పాటించాలన్నారు.

చివరి దశకు పి-4 : ఎంపిడిఒ

ప్రజాశక్తి - నరసాపురం

సమాజంలో పేద కుటుంబాలను గుర్తించేందుకు నిర్వహిస్తున్న పి4 సర్వే మండలంలో చివరి దశకు చేరుకుందని ఎంపిడిఒ వికె. వీరభద్రరావు తెలిపారు. ప్రభుత్వం నిర్దేశించిన మార్గదర్శకాలకు అనుగుణంగా గ్రామాల్లోని క్షేత్ర స్థాయిలో గ్రామ సచివాలయ సిబ్బందిచే క్షేత్ర స్థాయిలో సర్వే ముమ్మరంగా జరుగుతోందన్నారు.